తెలుగుప్రభ
మన భాష.. మన పత్రిక
సోమవారం 10-7-2023
వైబ్రెంట్ ఎడిషన్ 1 pm
teluguprabha.net
-TeluguPrabha
@TeluguPrabhaofficial

## బోనాల ఉత్సవాల్లో అపశ్రుతి

**తెలుగుప్రదఘ , హైదరాబాద్(జూలై10)**

ఘనంగా జరుగుతున్న సికింద్రాబాద్ మహంకాళి బోనాల ఉత్సవాల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. కార్వాన్‌కు చెందిన ఆకాశ్‌సింగ్(27) అమ్మవారి దర్శనానికి వచ్చి భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో బయటే నిలబడ్డాడు. వర్షం పడుతున్న ఆ సమయంలో అనుకోకుండా విద్యుత్‌స్తంభాన్ని తగిలి షాక్‌కు గురై మరణించాడు. ఆకాశ్‌సింగ్ బేగంబజార్ మార్కెట్‌లో సేల్స్‌మ్యాన్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం.

## లేటెస్ట్ న్యూస్


# వాగ్దానాలు మరిచారు.. అగ్నిప్రమాదాలతో జాగ్రత్త !



### ఉజ్జయిని మహంకాళి 'రంగం'లో భవిష్యవాణి వినిపించిన స్వర్ణలత

**తెలుగుప్రభ, హైదరాబాద్(జూలై10)**

గత సంవత్సరం ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, వాగ్దానాలు మరిచారని సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతరలో భాగంగా రంగం కార్యక్రమంలో భవిష్యవాణి వినిపించిన మాతంగి స్వర్ణలత అన్నారు. అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఈ సంవత్సరం సైతం నగరంలో మంచి వర్షాలు కురుస్తాయన్నారు. మీరు చేసిన పూజలతో సంతోషంగా ఉన్నానని, ఎలాంటి లోపాల్లేకుండా పూజలందుకున్నట్లు చెప్పారు. ఐదు వారాల పాటుముత్తయిదువలందరూ తననకు భక్తి శ్రద్ధలతో పూజించాలన్నారు. తన వద్దకు వచ్చేవారిని చల్లంగా చూసుకునే బాధ్యత తనదని చెప్పారు. చేసిన వాగ్దానాలు మరువరకుండా అమలు చేయాలని హితవు చెప్పారు.



## మరో అగ్నిప్రమాదం

### అపార్ట్‌మెంట్‌లో మంటలు

**తెలుగుప్రభ, హైదరాబాద్(జూలై10):**

హైదరాబాద్ నగరంలో అగ్నిప్రమాదాలు ఆగడం లేవు. సికింద్రాబాద్ పాలికాబజార్ బట్టల దుకాణంలో అగ్నిప్రమాదం ఘటన మరువక ముందే ఆదివారం అర్థరాత్రి బాలానగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం జరిగింది. ఐడీపీఎల్ చౌరస్తాలోని ఏ2ఏ లైఫ్‌స్పేస్ అపార్ట్‌మెంట్ ఐదు అంతస్తులో ఒక్కసారిగా చెలరేగిన మంటలు ఇతర అంతస్తులకూ చేరాయి. భారీగా మంటలు ఎగసిపడటంతో అపార్ట్‌మెంట్ వాసులు బయటకు పరుగులు తీశారు. అగ్నిమాపకసిబ్బంది వెంటనే అక్కడకు చేరుకొని మంటలను ఆర్పే పనులు చేపట్టారు. రెండు ఫైరింజన్లతో మంటలను అదుపులోకి తెచ్చారు. షార్ట్‌సర్క్యూట్ కారణమని భావిస్తున్నారు. ఇళ్లల్లోని సామాగ్రి పూర్తిగా కాలిపోయింది. పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు.



# ఆగమాగం

## అధ్యక్షుడి మార్పుతో అల్లకల్లోం

ప్రధాని వచ్చినా హుషారు కరువు
అసలేం జరుగుతోంది..
వివిధ వర్గాల్లో సందేహాలు..
నేటి రాష్ట్ర పదాధికారుల సమావేశంలోనూ చర్చ

బీజేపీలో ఇటీవల చోటు చేసుకుంటున్న పరిణామాలు రాష్ట్రంలో ఆపార్టీ గెలవడానికా లేక ఓడిపోవడానికా ? అన్న చర్చ ఒడవడం లేదు. రోజురోజుకూ మరింత తీవ్రమవుతోంది. దాదాపు రెండున్నరేళ్లుగా అటు రాష్ట్రంలో, ఇటు హైదరాబాద్ నగరంలో బలోపేతమైనట్లు కనిపించిన పార్టీ పరిస్థితి ప్రస్తుతం దిగజారుతోంది. పార్టీ పరిస్థితిపై నేడు జరిగిన రాష్ట్ర పదాధికారుల సమావేశంలో కూడా చర్చ జరిగినట్లు తెలిసింది.

**తెలుగుప్రభ, హైదరాబాద్(జూలై10):**

గత బల్దియా ఎన్నికల్లో ఊహించని విధంగా 48 డివిజన్లనుంచి బీజేపీ అభ్యర్థులు కార్పొరేటర్లుగా గెలవడంతో పెరిగిన ఉత్సాహం ఇటీవలి కాలందాకా కొనసాగింది. ఒక దశలో రాబోయే ఎన్నికల్లో అధికారం బీజేపీదేనని ఆపార్టీతోపాటు కొన్ని వర్గాలు సైతం ఊహించాయి.కానీ.. కర్నాటకలో కాంగ్రెస్ గెలుపు.. బీజేపీకి కొత్త చిక్కులు తెచ్చిపెట్టింది. రాష్ట్రంలోనూ కాంగ్రెస్ బలపడనుందనే ప్రచారం మొదలైంది. ఇతర పార్టీల నేతల చూపు కాంగ్రెస్‌పై పడింది. బండి సంజయ్‌ని రాష్ట్ర అధ్యక్షునిగా తప్పించడంతోనే పార్టీ ఊపు ఆకాశం నుంచి పాతాళానికి పడిపోయింది.

### దూరమవుతున్న నేతలు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షునిగా బండి సంజయ్‌ని తప్పించాక, ఈటల రాజేందర్‌ను ఎన్నికల కమిటీ చైర్మన్‌గా నియమించాక పార్టీలోని కీలకవ్యక్తులు దూరమవుతున్నారు. తెలంగాణలో పేరున్న మీడియాసంస్థ అధినేత వివేక్ వెంకటస్వామి, మాజీ మంత్రి చంద్రశేఖర్‌లతో పాటు విజయశాంతి కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. పార్టీ మారతారనే ప్రచారం జరిగింది. ఈటల రాజేందర్ చంద్రశేఖర్‌ను బుజ్జగించే ప్రయత్నాలు చేపట్టారు. ఇది ఏమేరకు ఫలితమిస్తుందో తెలియదు. ఇక వివేక్, విజయశాంతిలు హైదరాబాద్‌లో జేపీ నడ్డాతో జరిగిన సమావేశానికి హాజరైనప్పటికీ, వారి భవిష్యత్ కార్యాచరణ ఏమిటో తెలియదు. ఇక రఘునందన్ గురించి ఇప్పటికే అనుమానాలున్నాయి. ఆయన పార్టీలో ఉంటారో, లేదో తెలియని పరిస్థితి. కొత్త అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి రానున్న ఎన్నికలకు పార్టీని సంసిద్ధం చేయడం కంటే దూరమవుతున్న వారిని దగ్గర తీయడానికి, అలకలు తీర్చడానికే సమయం సరిపోయేలా లేదు.

### పార్టీలోనూ సంశయాలు

ఈనేపథ్యంలో బీజేపీ అగ్రనేతల్లోనే సంశయాలు నెలకొన్నాయి. బీఆర్‌ఎస్‌పై దూకుడు తగ్గించడం వల్ల తమకు కీడు జరగనుందనే అంశాన్ని హైదరాబాద్‌లో జరుగుతున్న 11 రాష్ట్రాల అధ్యక్షులు,ముఖ్య నేతల సమావేశాల సందర్భంగా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా దృష్టికి సైతం తీసుకువెళ్లినట్లు తెలుస్తోంది. అలాంటి సందేహాలు అవసరం లేదని, రాష్ట్రంలో గెలిచే అవకాశాలున్నాయని, కష్టపడి పనిచేయాలని నడ్డా హితబోధ చేసినట్లుసమాచారం. పార్టీ బలోపేతానికి ప్రత్యేక ఎజెండా అవసరమని భావించినట్లు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికలకు ఉన్నదే స్వల్ప సమయం.ఈలోగా ఎజెండాలు.. అమలు చేయడాలు ఏమేరకు సాధ్యమో వారికే తెలియాలి

### ప్రధాని వచ్చినా..

బీజేపీ అధిష్ఠానానికి సైతం రాష్ట్రంలో పార్టీ గెలవదనే విషయం తెలిసిపోయినట్లు రాజకీయ, సామాజిక విశ్లేషకులు చెబుతున్నారు. అందుకు కొన్ని అంశాల్ని వారు ఉదహరిస్తున్నారు. పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావాలనుకుంటే.. గెలవగలదన్న నమ్మకం ఉంటే భారీ మొత్తంలో నిధుల కేటాయింపులు.. కొత్త పథకాల ప్రకటనలు ఉంటాయంటున్నారు. ఇటీవల వరంగల్‌కు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీనుంచి అలాంటి ప్రకటనలేమైనా ఉంటాయోమేనని ఎందరో ఎదురు చూశారని,అవేవీ లేకపోవడంతో రాష్ట్రంలో గెలుస్తామనే నమ్మకం లేనందునే ఏవీ ప్రకటించలేదని చెబుతున్నారు. ఒక సందర్భంలో పార్టీ సీనియర్ నేత నితిన్ గడ్కరీ సైతం రాష్ట్రంలో తమ పార్టీ ప్రధాన ప్రతిపక్షంగా ఎదగనుందని వ్యాఖ్యానించడాన్ని ప్రస్తావిస్తున్నారు. దీంతో పార్టీ శ్రేణుల్లోనూ మునుపటి హుషారు కనిపించడం లేదు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే గోల్కొండ ఖిల్లా మీద కాషాయజెండా ఎగురవేయాలన్న బీజేపీ కలలు ఫలించేనా ? కల్లలయ్యేనా ?అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



### మాదాపూర్‌లో యువకుడు.. బంజారాహిల్స్‌లో మహిళ

## ఆత్మహత్య

### భర్త భోజనం చేయడం లేదని..

**తెలుగుప్రభ, బంజారాహిల్స్ (జూలై 10)**

ఓ గృహిణి బంజారాహిల్స్‌లో ఆత్మహత్యకు పాల్పడింది. కొద్ది రోజులుగా జరుగుతున్న గొడవలతో భర్త ఇంట్లో భోజనం చేయడం లేదు. మనస్తాపానికి గురైన భార్య ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గౌరీ శంకర్ కాలనీలో ఉండే సంగీత, సంజీవ్ 2019లో వివాహం చేసుకున్నారు. ఇద్దరి మధ్య మూడు రోజుల క్రితం గొడవ జరిగింది. అప్పటి నుంచీ సంజీవ్ బయటే భోజనం చేస్తున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన సంగీత ఫ్యాన్‌కు ఉరేసుకుని తనువు చాలించింది.

### అప్పుల బాధతో..

**తెలుగుప్రభ, మాదాపూర్ (జూలై 10)**

గాజుల రామారం హెచ్ఏఎల్ కాలనీకి చెందిన హేమంత్ కుమార్ (25) ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పుల బాధతోనే చనిపోయినట్లు తెలుస్తోంది. అతడు మాదాపూర్‌లోని ఓ హోటల్ టెక్నికల్ సూపర్‌వైజర్‌గా పని చేసేవాడని పోలీసులు చెబుతున్నారు. అదే హోటల్‌లోని టెర్రస్‌పై ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నిర్వాహకులు గమనించిన మాదాపూర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ అవినాష్ ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఆర్థిక సమస్యలే ఆత్మహత్యకు కారణమని పేర్కొన్నారు.

### జిమ్ చేసి ఇంటికి..

## గుండెపోటుతో యువకుడి మృతి

### టీ కాంగ్రెస్ నేత కుమారుడి ఇంట్లో విషాదం

**తెలుగుప్రభ, ఖమ్మం (జూలై 10)**

అప్పటి వరకూ జిమ్‌లో కసరత్తులు చేసిన యువకుడు ఇంటికి వచ్చిన వెంటనే హఠాన్మ రణం చెందాడు. 31 ఏళ్లకు కుమారుడి మృతితో ఆ కుటుంబం తల్లడిల్లిపోతోంది. సోమవారం జరిగిన ఈ ఘటనతో ఖమ్మంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కాంగ్రెస్ పార్టీ నేత మానుకొండ రాధా కిషోర్ కొడుకు మానకొండ శ్రీధర్(31) గుండెపోటుతో మృతి చెందాడు. సోమవారం ఉదయం జిమ్‌కి వెళ్లిన శ్రీధర్.. అక్కడ వర్కౌట్లు పూర్తి చేసుకున్న తర్వాత ఇంటికి తిరిగొచ్చాడు. వెళ్లి వచ్చిన కొద్దిసేపటికి గుండెపోటుకు గురయ్యాడు. కుటుంబసభ్యులు హుటాహుటిన సమీపంలోని ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే గుండెపోటుతో చనిపోయినట్లు డాక్టర్లు నిర్ధారించారు. కుమారుడు మరణంతో కాంగ్రెస్ నేత రాధా కిషోర్ ఇంట్లో విషాదం నెలకొంది. ఆయన కుటుంబాన్ని పలువురు కాంగ్రెస్ నేతలు పరామర్శిస్తున్నారు.



## దిగ్విజయ్‌సింగ్‌పై కేసు

**తెలుగుప్రభ, న్యూఢిల్లీ (జూలై 10)**

కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్‌పై కేసు నమోదైంది. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్సెస్) మాజీ చీఫ్ ఎంఎస్ గోవల్కర్ పై సోషల్ మీడియాలో అనుచిత పోస్ట్ పెట్టారన్న ఫిర్యాదుతో ఆయనపై మధ్యప్రదేశ్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఇందౌర్ పోలీసు అధికారి తెలిపారు. లాయర్, ఆర్ఎస్సెస్ కార్యకర్త రాజేశ్ జోషీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దిగ్విజయ్ సింగ్ పై పలు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు వెల్లడించారు. దళితులు, ముస్లింలు, హిందువుల మధ్య చిచ్చుపెట్టేందుకు దిగ్విజయ్ సింగ్ ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు చెప్పారు.



# వరదల్లో బస్సు..

## ప్రయాణికుల ఆర్తనాదాలు



### వణుకుతున్న ఉత్తరాధి..

### భారీ వర్షాలు.. 25 మందికిపైగా మృతి

భారీ వర్షాలు ఉత్తరాధిని అతలాకుతలం చేస్తున్నాయి. ప్రజలను వణికిస్తున్నాయి. వరదల్లో కొట్టుకుని పోయి ఇప్పటి వరకు 25 మందికి పైగా మృతి చెందినట్లు వార్తలు వస్తున్నాయి. హిమాచల్ ప్రదేశ్‌లో భారీవర్షాల కారణంగా నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వికాస్‌నగర్ సమీపంలో హిమాచల్ ప్రదేశ్ రోడ్‌వేస్ బస్సు వరదల్లో చిక్కుకుపోయింది. దీంతో ప్రయాణికులు హాహాకారాలు చేశారు. స్థానికుల సాయంతో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. బస్సు వరద కాలువలో చిక్కుపోయిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

### హస్తినకు పొంచి ఉన్న వరద ముప్పు

దేశ రాజధాని ఢిల్లీలో రికార్డు స్థాయిలో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఢిల్లీలోపాటు రాజధాని ప్రాంతంలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వానలకు నగరంలో యమునా నదికి వరద పోటెత్తింది. నదిలో వరద ప్రవాహం ప్రమాద స్థాయికి చేరింది. అయితే హస్తినకు మరో ముప్పు పొంచిఉన్నది. రెండు రోజుల్లో ఢిల్లీని భారీ వరద తాకనుంది. ఇప్పటికే రాజధానిలో కురుస్తున్న వర్షాలతో ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోయాయి. వీటికి ఎగువ రాష్ట్రం నుంచి వచ్చే వరద తోడవనుంది. భారీ వర్షాలు కొనసాగే అవకాశం ఉండటంతో ఢిల్లీ వాసులు అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ యల్లో అలర్ట్ జారీ చేసింది.

**తెలుగుప్రభ, న్యూ ఢిల్లీ (జూలై 10)**

ఉత్తరాదిలోని చాలా ప్రాంతాల్లో ఎడతెరిపి లేని భారీ వర్షాలు కురుస్తున్నాయి. కుంభవృష్టిగా కురుస్తున్న వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమైంది. రోడ్లు దెబ్బతిన్నాయి. పలు చోట్ల కొండచరియలు విరిగిపడుతున్నాయి. యమున సహా పలు నదులు పొంగి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. దీంతో వరద పోటెత్తి పలు ప్రాంతాలు నీటిలో చిక్కుకుపోయాయి.

వర్షాల కారణంగా జరిగిన ప్రమాదాల్లో హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ జమ్మూ-కశ్మీర్ లో 17 మంది ప్రాణాలు కోల్పోగా.. యూపీ, ఢిల్లీ, పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఐదు మరణాలు నమోదయ్యాయి. ఉత్తరాది రాష్ట్రాల్లో రాబోయే రెండు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

హిమాచల్ ప్రదేశ్ లోని 10 జిల్లాలకు అధికారులు రేడ అలర్ట్ ప్రకటించారు. భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలో 14 చోట్ల పెద్ద ఎత్తున కొండచరియలు విరిగిపడ్డాయి. 13 ప్రాంతాలను ఆకస్మిక వరదలు ముంచెత్తాయి. రాష్ట్రంలో 700 రహదారులను మూసివేశారు. మరోవైపు చండీగఢ్, హరియాణా రాష్ట్రాలను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. చండీగఢ్ లో ఇప్పటి వరకు 322.2 మి.మీ, హరియాణాలోని అంబాలాలో 224.1 మి.మీ వర్ష పాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.